క్లుప్తంగా

ఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలి

శావల్యాపురం: వైద్య ఆరోగ్య సిబ్బంది సారథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు పారదర్శకంగా అందేలా చూడాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం మంగళవారం తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే ఈఏడాది మెరుగైన వైద్య సేవలు అందించి జిల్లాలో ఆరోగ్య కేంద్రం ప్రథమస్థానంలో ఉండేలా అందరూ తమవంతు సహకారం అందించాలన్నారు. అనంతరం ఏపీ ఎన్జీవో నూతన సంవత్సరం క్యాలెండరు అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెండవ వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, సూపర్ వైజర్లు సాయిలత, సూర్యకుమార్, స్టాఫ్ నర్సులు బాలిబోయిన లక్ష్మిప్రసన్న, ధనలక్ష్మి, ఆరోగ్య ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛను వారోత్సవాలు విజయవంతం చేయండి

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 5న నిర్వహించే వైఎస్సార్ సామాజిక నూతన పింఛన్ల వారోత్సవాలు విజయవంతమయ్యేలా అన్నీ శాఖల అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛను వారోత్సవాల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పింఛను వారోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 5552 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లుగాను ప్రతినెల రూ. ఒక కోటి 50 లక్షల 86 వేల 250 లబ్ధిపొందుతున్నారని, 2023 నూతన సంవత్సరంలో అదనంగా 216 నూతన పింఛన్లు మంజూరు కాగా రూ. 7లక్షల 44వేల 500లు నగదు రూపంలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. అలాగే టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు షేక్ జాన్సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎస్సై గల్లా రవికృష్ణ, ఏపీయం జి.వాసుబాబు, ఏపీవో రాజు, ఏఈ మూఢవత్ ఆకాష్ ఉన్నారు.

నేడు పురపాలక సంఘం సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశపు హాలులో ఈనెల 4 వతేదీన పురపాలక సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్ ప్రతిపాదనలతోపాటు పలు అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు.

ముఖ్యమంత్రి చిత్రపటం తొలగింపుపై ....

నాదెండ్ల: మండల పరిధిలోని ఎండుగుంపాలెం గ్రామ సచివాలయం భవనానికి ఏర్పాటు చేసిన బోర్డులో ముఖ్యమంత్రి చిత్రాన్ని పలుమార్లు తొలగించటం వివాదాస్పదమౌతోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఈ గ్రామంలో టీడీపీ మద్దతు గల వ్యక్తి గట్టినేని నాగేశ్వరరావు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయంపై సచివాలయ బోర్డును ఏర్పాటు చేసింది. అయితే సదరు బోర్డులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి చిత్రపటం ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని తొలగించారు. ఇలా ఇప్పటికి నాలుగుసార్లు జరగ్గా, పంచాయతీ సిబ్బంది తిరిగి చిత్రపటాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా ఈ నెల 1వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు సీఎం చిత్రపటానికి నల్లరంగు పూశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎంపీడీవో జాకీర్ హుస్సేన్‌ను వివరణ కోరగా, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లుతెలిపారు.

రెస్టారెంట్లలో తనిఖీలు

నరసరావుపేట టౌన్ : పట్టణంలోని పలు రెస్టారెంట్లపై కల్తీ ఆహార నియంత్రణ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి సి.హెచ్. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వినుకొండ, రావిపాడు రోడ్లలోని రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహించి ఆహార పదార్థాలలో వినియోగించే వంట నూనె శాంపిళ్లను సేకరించారు. కల్తీలను నివారించేందుకు ప్రభుత్వం టీపీటీ(టాలరీస్ రీడింగ్ మీటర్) లను ప్రవేశపెట్టిందన్నారు. మీటర్‌తో నూనెలను పరిశీలించి కల్తీ శాతాన్ని నిర్ధారిస్తామన్నారు.

దివ్యాంగులకు దుస్తులు వితరణ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలోగల సరోజనీ దేవి దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు దాతలు నూతన దుస్తులు వితరణ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సి.సుధాకర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శాంతి సంక్షేమ అభివృద్ధి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ప్రకాష్ గుడ్‌లక్ షోరూం వారి ఆర్థిక చేయూత 30 మంది వికలాంగ విద్యార్థులకు నూతన వస్త్రాలు వితరణ చేసినట్లు సంస్థ చైర్మన్ జుంజు యేహాను, సెక్రటరీ మల్లాపరపు రవికుమార్ లు తెలిపారు. కార్యక్రమంలో అంకమ్మరావు, అక్కారావు, అశోక్, డి.వరమ్మ ఉన్నారు.

గుంటూరు వెళ్లి.. పింఛను చేతికిచ్చి...



వినుకొండ రూరల్ పరిధిలోని పిట్టంబండ గ్రామానికి చెందిన మక్కెన చిన్న వెంకటేశ్వర్లు అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. అయితే ఒకటవ తారీకునే పింఛను అందుకోవాల్సిన వెంకటేశ్వర్లు ఆస్పత్రిలో చేరిన విషయాన్ని గమనించిన వార్డు వలంటీరు షేక్ మస్తాన్ వలి మంగళవారం గుంటూరు వెళ్లి వెంకటేశ్వర్లుకు వృద్ధాప్య పింఛను అందించారు. వలంటీరు సేవలకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

– వినుకొండ టౌన్

45 కిలోమీటర్లు వెళ్లి..



గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ బంధువుల గృహంలో ఉంటున్న పట్టణంలోని 12వ వార్డుకు చెందిన నూతన పింఛన్‌దారుడికి మహిళా వలంటీరు 45 కిలోమీటర్లు వెళ్లి ఫించన్ రూ.2750లను అందజేసింది. దివ్యాంగుడు ఈవూరి కోమల్ రత్నాకర రెడ్డి గుంటూరులోని తన బంధువుల గృహంలో ఉండగా వలంటీరు క్రోసూరి రూపాదేవి మంగళవారం అక్కడకు స్వయంగా వెళ్లి పింఛన్ అందజేశారు. దీనిపై స్థానిక నాయకులు, అధికారులు వలంటీరును అభినందించారు.

– నరసరావుపేట

■ క్షీరాభిషేకం



యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజినితో కలిసి అవ్వా తాతలు, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పింఛన్ కానుక రూ.2500 నుంచి రూ.2750కు పెంపుదల చేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. – యడ్లపాడు

స్త్రీ జనోద్ధరణ మూర్తి సావిత్రీబాయిఫూలే

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఘనంగా సావిత్రీబాయి పూలే 192వ జయంతి వేడుకలు



రొంపిచర్లలో పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు



గణపవరం హైస్కూలులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యడ్లపాడు: పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండలంలో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే 192వ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులతో కలిసి సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్త్రీ జనోద్ధరణకు, మహిళా విద్యా చైతన్యానికి పునాది సావిత్రిబాయి అన్నారు. శతాబ్దాల కిందటే ఆమె మహిళాభ్యున్నతి చేసిన సేవలను కొనియాడారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: సమాజంలో హక్కుల కోసం గళమెత్తిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, ధీరవనిత సావిత్రీబాయి పూలే అని సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక, హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులు మల్లేశ్వరి, ఝాన్సీరాణి, శివకుమారిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుచ్చిబాబు, వలంటీర్ మాణిక్యమ్మ ఉన్నారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయిపూలే జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం తాడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, అంటరానితనం, సతీ సహగమనం వంటి సాంఘిక దురాచారాలను ప్రశ్నించటమే కాక, విద్యను అన్ని వర్గాలకు దరిచేర్చటంలో సావిత్రీబాయిపూలే జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి బాతుగున్నల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా అక్షరాస్యత కోసం కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గాలి సాంబశివరావు, నాయకులు సరికొండ తిమ్మరాజు. ముక్కడాల వెంకటేశ్వరరావు, పేరేచెర్ల కోటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, కంబంపాటి నరసింహా, పిడం హుస్సేన్, పూజల ప్రసాదు, బత్తుల అశోక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లను జనవిజ్ఞాన వేదిక నాయకులు చలపతిరావు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో సరికొండ రామకృష్ణంరాజు, శివరామ్, వెంకట సుబ్బరాజు, మస్తాన్‌వలి, శేషంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీ ఖోఖో రన్నర్స్ విక్టరీ కళాశాల



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో పోటీలలో విక్టరీ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించటంతోపాటు నలుగురు విద్యార్థులు వర్సిటీ జట్టుకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజశేఖరరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎన్.కృష్ణంరాజు మంగళవారం తెలిపారు. వర్సిటీలో రెండురోజుల పాటు నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు కె.రామకృష్ణ, పి.అశోక్, బి.ప్రదీప్, పి.సైదారావు వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ వి.సుబ్బారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

జలజీవన్ మిషన్ పథకానికి అంచనాలు

శావల్యాపురం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలోని 17 గ్రామాలకు నూతనంగా ఇంటింటి నీటికుళాయిల ఏర్పాటుకు రెండవ విడతలో భాగంగా రూ. 7 కోట్ల 35 లక్షల నిధుల వ్యయంతో ప్రభుత్వ పరంగా అంచనాలు వేసినట్లు ఆర్‌డబ్ల్యూఏస్ ఏఈ మూఢవత్ ఆకాష్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలోని గంటావారిపాలెం–40 లక్షలు, వయ్యకల్లు–14 లక్షలు, ముండ్రువారిపాలెం–08 లక్షలు, ధర్మపురి–08 లక్షల నిధులతో ఇంటింటి నీటి కుళాయి పనులు పూర్తి అయినట్లు చెప్పారు. మండలంలోని కారుమంచి గ్రామంలో రూ. 36 లక్షల, కొత్తలూరు రూ.22 లక్షల వ్యయంతో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. రెండవ విడతలో అంచనాలు వేసిన గ్రామాల్లోని పనులకు సంబంధించి టెండరు దశలో ఉందన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి ఎస్సీ కాలనీప్రధాన వీధిలో రాజ్యాంగ రూపకర్త డాక్టరు బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా అనుమతులు కోసం తహసీల్దారు షేక్ జాన్సైదులకు మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు మండల మాలమహానాడు ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు తెలిపారు. పూర్వీకుల నుంచి ఎస్సీ కాలనీ వాసులు కోసం మంచినీటి బావి కేటాయించగా, సదరు బావి ఉన్న ప్రదేశ స్థల విస్తీర్ణం రెండున్నర సెంట్లు ఉందన్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ఇద్దరు విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అభ్యంతరం తెలిపి పలురకాలుగా తెలిపి దుర్భాషలాడినట్లు తహసీల్దారుకు వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాలమహానాడు జిల్లా ప్రతినిధి కె. విజయ్ కుమార్, వినుకొండ కన్వీనర్ కె.వెంకటేశ్వర్లు, కాలనీవాసులు మరియదాసు, కొర్రపాటి కృష్ణ ఉన్నారు.

సూపర్‌వైజరు పోస్టులకు ఇరువురికి అర్హత

బొల్లాపల్లి: ఐసీడీఎస్ సూపర్‌వైజరు పోస్టులకు మండలంలోని అంగన్ వాడీ కేంద్రాలకు చెందిన ఇరువురు అంగన్ వాడీ కార్యకర్తలు అర్హత సాధించారు. ఇటీవల మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షల్లో మండలంలోని రేమిడిచర్ల, జయంతి రామపురం అంగన్‌వాడీ కార్యకర్తలు కె.శ్రీలత, వి.దుర్గలు ఇద్దరు గ్రేడ్–2 సూపర్‌వైజరు పోస్టులకు అర్హత సాధించారని పల్నాడు జిల్లా ఇన్‌చార్జి పీడీ బి.అరుణ మంగళవారం తెలిపారు. ఇద్దరు ధ్రువీకరణ పత్రాలు పరిశీలన, విధి నిర్వహణ కేటాయిస్తారని ఇన్‌చార్జి పీడీ తెలిపారు. గ్రేడ్–2 సూపర్‌వైజరు పోస్టులు సాధించిన ఇద్దరు అంగన్ వాడీ కార్యకర్తలను ఇన్‌చార్జితో పాటు సూపర్ వైజరు వి.శ్రీదేవి అభినందించారు.

వినుకొండ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 10వ వార్డులో గడప గడపకు మనప్రభుత్వం



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ అభివృద్ధికి ఎవరు అడ్డుపడినా ఆపలేరని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. పట్టణంలోని 10వ వార్డులో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు సైంధవుడిలా అడ్డుపడుతున్నారని 10 ఏళ్లలో మాజీ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి మూడేళ్లలో చేసి చూపించామన్నారు. పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు, మున్సిపల్ స్టేడియం, ఎన్ఎస్పీ కెనాల్స్‌పై సీసీ రోడ్డు, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం, కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణంతోపాటు పట్టణంలో ఎటు చూసినా 15 కిలోమీర్ల దూరం అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలకు 5400 ఇళ్లు జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప మాజీ ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. రానున్న రోజుల్లో వినుకొండను రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చేవిధంగా తీర్చిదిద్దుతామని, 24 గంటలూ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పట్టణంలో తాగునీటి ట్యాంకులు, నూతన పైపులైను నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు షకీలా, వైస్‌చైర్మన్ బేతం గాబ్రియేలు, తెల్లాకుల రాజేష్ ఖన్నా, పట్టణ పార్టీ అధ్యక్షులు, పీఎస్ ఖాన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్పెనోమ్, నరాలశెట్టి శ్రీనివాసరావు, యారం రామిరెడ్డి, బేతం శ్యామ్ లతోపాటు వార్డు వలంటీర్లు అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- భావనారుషి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని భావనారుషినగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందు కోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. రూ. 16 వేల కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని వివరించారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం అవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,వార్డు కౌన్సిలర్ బిట్రా రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు కసనానాయక్, ప్రగడ రామకోటేశ్వరరావు, పాలడుగు శివపార్వతి, అవ్వారు అన్నపశెట్టి, ఊట్ల సాంబమూర్తి, ప్రగడ రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధే జగనన్న పథం.. అబద్ధాలు చంద్రబాబు నైజం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరు
- అవ్వ,తాతల మోముల్లో సంతోషమే తమ ప్రభుత్వ లక్ష్యం
- అసత్య ప్రచారాలపై ఆగ్రహం
- జగనన్నకు అండగా ఉండాలని విన్నపం



యడ్లపాడులో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పథం కాగా.. అబద్ధపు ప్రచారాలు చేయడం మాజీ సీఎం చంద్రబాబు నైజమని మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు మండలంలో కొత్త ఏడాది విడుదలైన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు. పెరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. సామాజిక పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి పంపించిన సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో జగనన్న పాలనలో అవ్వతాతలు, అక్కా చెల్లెమ్మలు, అన్నదమ్ములు అందరూ సంతోషంగా ఉన్నారు.

టీడీపీ హయాంలో ఏ పింఛన్ అయినా సరే రూ.1000 చొప్పున ఇచ్చారు. పాదయాత్రలో జననేత పింఛన్ రూ.2 వేలంటూ మేనిఫెస్టో విడదలయ్యాకనే ఉలిక్కిపడి బాబు రూ.2 వేలంటూ ఎన్నికలో ముందునాడు ప్రకటించారన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మందికి పింఛన్ రూ.400 కోట్లు ఖర్చు చేస్తే, జగనన్న ప్రభుత్వంలో రూ.2వేల నుంచి పెంచుకుంటూ నేడు రూ.2750 చొప్పున అవ్వతాతలకు ఇస్తున్నారని తెలిపారు. వీరితో పాటు వికలాంగులు, కళాకారులు రూ.3 వేలు, డయాబెటిస్, కుష్ఠువ్యాధిగ్రస్తులకు రూ.5 రూ.10 వేల చొప్పున చెల్లిస్తూ.. రాష్ట్రంలో 64 లక్షల మందికి రూ.1765 కోట్లను ఒక్క పింఛన్ ద్వారానే తమ ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు.

యడ్లపాడు మండలంలో...

టీడీపీ హయాంలో 5278 పింఛన్లు ఉండగా, వైఎస్సార్‌సీపీ వచ్చాకా 7980కు పెరిగాయన్నారు. ఈ ఏడాది జనవరిలో మరో 261 మంజూరు చేయగా మొత్తంగా 8241 పింఛన్లుకు రూ.2.02 కోట్లకు ప్రతినెలా చెల్లింపులు చేస్తున్నామన్నారు. చెప్పేవారు, చేసే వారికి మధ్య తేడాను గమనించాలన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ కె.హేమ, జెడ్పీటీసీ ముక్తావాసు, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కల్లూరి విజయ్‌కుమార్, గంటా శంకర్, రాచమంటి చింతారావు, ఎంపీ బాలచంద్రారెడ్డి, బసెల శివరామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు షేక్ గౌసందాని, ఎంపీడీవో వై హనుమారెడ్డి, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఘనత వైఎస్సార్ సీపీదే


- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్లలో పింఛన్ వారోత్సవాలు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల):వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లతోపాటు కల్లుగీత, కార్మికులు పింఛన్లు ఇస్తూ పేదలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్లలో పింఛన్ పంపిణీ వారోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా ముఖ్య అతిథిగా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు హయాంలో 39 లక్షల పింఛన్లు ఇచ్చే వారని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 64 లక్షల పింఛన్లు ఇస్తున్నామన్నారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం పెంచి రూ.2750 ప్రస్తుతం ఇస్తున్నట్లు చెప్పారు. ఒక్క నూజెండ్ల మండలంలో గతంలో 6643 మందికి పింఛన్లు వస్తే ప్రస్తుతం 278 నూతన పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీ చెప్పిన వారికి కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ కులాలకు, పార్టీలతంగా ఇంటింటికే పంపిణీ చేస్తున్న ఘనత మాదేదనాన్నరు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, వంగూరి ప్రసాద్‌లతోపాటు పలువురు పార్టీ నాయకులు ఎంపీడీవో జిలానీ బాషాలతో పాటు అధికారులు, పాల్గొన్నారు.

బూస్టర్ డోస్‌పై శిక్షణ



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు పోలియో వ్యాక్సిన్ బూస్టర్ డోస్ పై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం చిన్నపిల్లలకు పోలియో రాకుండా ఇస్తున్న వ్యాక్సిన్‌ను ఆరు వారాల వయస్సులో, 14 వారాల వయస్సులో ఇస్తారన్నారు. ఈ నెల నుంచి 10 నెలల వయస్సు పిల్లలకు కూడా పోలియో వ్యాక్సిన్ బూస్టర్ డోస్ ఇవ్వనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ స్వాతి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

– రొంపిచర్ల